క్లుప్తంగా

ఎమ్మెల్యే ఉదయభాను ఉగాది శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నూతన సంవత్సరంలో రైతులు పాడిపంటలు సంవృద్ధిగా పండడంతో పాటు కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం



వత్సవాయిలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్, జెడ్పీటీసీలు

వత్సవాయి: రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా పౌష్టికర ఆహారాన్ని అందిస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో లక్ష్మీభార్గవి తెలిపారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 3 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికరమైన ఆహారం గురించి బాలింతలు, గర్భిణులకు మండలంలోని 80 కేంద్రాల్లో ఈ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేసినట్లు సీడీపీవో తెలిపారు. కార్యక్రమంలో వత్సవాయి సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఏసీడీపీవో నాగమణి, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్, శారద అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోనీకి ఉగాది యువ కవితా పురస్కారం



కంచికచర్ల: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, బహుజన రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తంగిరాల సోనీకి ఉగాది యువ కవితా పురస్కారం లభించింది. విజయవాడలో మంగళవారం జరిగిన ఉగాది ఉత్సవాలలో భాగంగా ఆయన్ను శాలువాతో సత్కరించి ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రఖ్యాత సాహితీ విమర్శకుడు జి.లక్ష్మీనర్సయ్య, గజల్ శ్రీనివాస్, విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, కవులు శిఖా ఆకాష్, ఘంటా విజయకుమార్, సరికొండ నరసింహరాజు పాల్గొన్నారు.

ఉప నదులకు వచ్చి చేరుతున్న వరద నీరు



నందిగామ: ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు మున్నేరు, వైరా, కట్టలేరులకు వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం మధ్యాహ్నం నుంచి వరద నీటి ఉధృతి మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద వైరా నదిపై ఉన్న కాజ్ వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది.అంతకంతకు వరద నీటి ప్రవాహం అధికమవుతుండడంతో ఆర్డీఓ రవీంద్ర రావు డివిజన్ పరిధిలోని అధికారులను అప్రమత్తం చేశారు. ఉపనదుల పరివాహక ప్రాంత ప్రజలు ఎవరూ ఉపనదులలోకి వెళ్లవద్దని సూచించారు. అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

త్వరితగతిన గృహాలు నిర్మించాలి

జగ్గయ్యపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని ఇన్‌చార్జ్ హౌసింగ్ డీఈ సూర్యప్రకాశరావు అన్నారు. మండలంలోని గౌరవరం, తిరుమలగిరి గ్రామాలలోని జగనన్న కాలనీలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు.

నేడు గజల్ శ్రీనివాస్ రాక

జగ్గయ్యపేట అర్బన్: ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం స్థానిక విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక కోదాడ రోడ్డులోని బి.కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఉత్సవాలు జరుగుతాయని ఫౌండేషన్ చైర్‌పర్సన్ విమలాభాను తెలిపారు. ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ పాల్గొంటారని, గౌరవ అతిథులుగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం



నందిగామ పట్టణంలో రాగి జావ పంపిణీ ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పెద్దాపురంలో రాగిజావ పంపిణీ చేస్తున్న వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి

నందిగామ టౌన్: ఆరోగ్యమే మహా భాగ్యమని, రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. గతంలో మాదిరిగా వంట ఏజెన్సీలకు నచ్చిన ఆహారాన్ని అందించటం కాదని ప్రభుత్వమే మెనూ రూపొందించి దానికి అనుగుణంగా విద్యార్థులకు రుచికరమైన, పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, ఎంఈవో బాలాజీ, సత్యమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం, కౌన్సిలర్లు పాకాలపాటి కిరణ్, మారం అమరయ్య, షేక్ ఖాలిక్, దాసు, ప్రధానోపాధ్యాయుడు రాంబాబు నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా రాగిజావ పంపిణీ

నందిగామ: జగనన్న గోరుముద్దలో భాగంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మరింత ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం మంగళవారం నుంచి ప్రతి పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. నందిగామ, చందర్లపాడు మండలాలలోని మండల పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పెద్దాపురంలో...

వీరులపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యూపీ పాఠశాలలో మంగళవారం ఆమె జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మండూరి ప్రకాశరావు, ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్ పాల్గొన్నారు.



జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లిలో రాగిజావ తీసుకుంటున్న విద్యార్థులు

జగ్గయ్యపేట మండలంలో...

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు రాగిజావను పౌష్టికాహారంగా అందిస్తోందని సర్పంచ్ త్రివేణి నాయుడు తెలిపారు. మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. బలుసుపాడు, పోచంపల్లి గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

వత్సవాయిలో...

వత్సవాయి: జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందించే పుష్టికరమైన భోజనంలో మరొక పౌష్టికాహారమైన రాగిజావను అందించనున్నారు. తొలిరోజు మంగళవారం అన్ని పాఠశాలల్లో ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధుల చేతులమీదుగా అందించారు. వత్సవాయిలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మక్కపేటలో ఎంఈవో ఎల్.నాగరాజు, సర్పంచ్ గుడేటి శారమ్మ, మంగొల్లులో సర్పంచ్ అన్నెపాక ప్రణీత విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కనగాల రమేష్, కేవైఎన్ శర్మ, హెచ్‌ఎంలు వల్లూరి కృష్ణయ్య, అజ్మీరు కొండ తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీలు

పెనుగంచిప్రోలులో...

పెనుగంచిప్రోలు: జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో రాగిజావను అందించారు. పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ వూట్ల నాగమణి. ముళ్లపాడులో సర్పంచ్ గూడపాటి లావణ్య, అనిగండ్లపాడులో సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, కొణకంచిలో గోనెల దేవి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, కాకాని హరి తదితరులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



వత్సవాయిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న సర్పంచ్ సీతమ్మ, జెడ్పీటీసీ దేవమణి

రాగి జావతో పోషక విలువలు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం గోరుముద్ద పథకం ద్వారా కొత్తగా అందజేస్తున్న రాగి జావ ద్వారా విద్యార్థులకు మంచి పోషక విలువలు అందుతాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక కాకానినగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రావు, ఖాదర్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భద్రాద్రి రాముడికి గోటి తలంబ్రాలు



హైందవశక్తి ప్రతినిధులకు తలంబ్రాలు అందిస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు: భద్రాద్రి రాములోరి కల్యాణానికి మండలంలోని పలు గ్రామాల నుంచి గోటితో వలిచిన తలంబ్రాలను హైందవశక్తి ద్వారా భద్రాచలం పంపించారు. పెనుగంచిప్రోలుతో పాటు అనిగండ్లపాడు, వేమవరం గ్రామాల నుంచి తలంబ్రాలను మంగళవారం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయం వద్దకు చేర్చారు. అన్నీ ఒకచోట చేర్పించి పూజాకార్యక్రమాలు నిర్వహించిన తరువాత హైందవశక్తి ప్రతినిధులకు అప్పగించారు.

విద్యార్థులకు ప్లేట్‌లు, గ్లాసులు పంపిణీ

జగన్నాధపురం(వీరులపాడు): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ప్రధానోపాధ్యాయురాలు అమర్లపూడి బేబి అన్నారు. మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తమ్మా వరప్రసాద్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుధాకర్ రెడ్డి రూ.10 వేల విలువ చేసే ప్లేట్‌లు, గ్లాసులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్ పాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తమ్మా జ్ఞానారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోపాల్ మృతి బాధాకరం

నందిగామ టౌన్: ప్రముఖ మొబైల్ షాపు నిర్వాహకుడు నలజాల గోపాల్ మృతి బాధాకరమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలోని గోపాల్ నివాసంలో మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. గోపాల్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

చిన్నారుల భవిష్యత్‌కు భరోసా ఇచ్చిన సీఎం జగన్

జగ్గయ్యపేట అర్బన్: తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న అభాగ్యులకు నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఆపన్న హస్తాన్ని అందిస్తూ, వారి భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట మండలం షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన గాదె సురేష్ ఇరువురు కుమార్తెలు అంతుపట్టని అరుదైన వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం నెలకు సుమారు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఉదయభాను ఇటీవల తిరువూరు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి చిన్నారుల పరిస్థితిని వివరించారు. తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి తక్షణ సహాయం క్రింద రూ.లక్ష అందించారు. వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు. నెలవారీ వారికి అయ్యే ఖర్చుల నిమిత్తం పిల్లలకు పెన్షన్ కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో గాదె సురేష్ కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి మంజూరు చేసిన చెక్కును ఉదయభాను అందజేశారు. దీంతో ముఖ్యమంత్రికి, ఉదయభానుకు సురేష్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. షేర్‌మహ్మద్‌పేట గ్రామ నాయకులు పెద్దిరెడ్డి స్వామి, మోరె వినోద్, నాగుల్‌మీరా, ఉద్దగిరి కృష్ణ, సుంకిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, శరణం ఉపేంద్ర, రామకోటి, వత్సవాయి మండల పార్టీ అధ్యక్షుడు గాదెల రామారావు, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



బాధిత పిల్లల తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

మున్నేట్లో చిక్కుకున్న జీపు, ట్రాక్టర్



మున్నేట్లో చిక్కుకున్న వాహనాలు

నందిగామ: పట్టణ సమీపంలోని మున్నేరు ఉపనదిలో ఓ జీపు, ట్రాక్టర్ చిక్కుకున్న ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. తహసీల్దార్ నరసింహారావు తెలిపిన సమాచారం ప్రకారం పట్టణానికి చెందిన పలువురు యువకులు మున్నేట్లో సరదాగా జీపుపై చక్కర్లు కొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా మున్నేటికి వరద నీరు వచ్చి చేరడంతో జీపు వరద నీటిలో చిక్కుకుంది. దానిని ఒడ్డుకు తీసుకువచ్చేందుకు ఓ ట్రాక్టర్ వెళ్లి అది కూడా నీటిలో చిక్కుకుంది. మరికొన్ని పెద్ద వాహనాల ద్వారా వాటిని బయటకు తీసుకొచ్చేందుకు రాత్రి పొద్దుపోయే వరకు అధికారులు శ్రమించారు. అయినా ప్రయోజనం లేకపోయిందని, అయితే వాహనాల్లో ఉన్నవారు అందరూ సురక్షతమని తహసీల్దార్ తెలిపారు. నీటిలో చిక్కుకున్న వాహనాలను బుధవారం ఒడ్డుకు తీసుకువచ్చే ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని శిశుసంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఉమారాణి తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగనవాడీ కేంద్రాల్లో సంపూర్ణ పోషణ కిట్‌లతో పాటు చిరుధాన్యాలను ఆహారంలో చేర్చిందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీడీపీవో లక్ష్మీభార్గవి, అంగనవాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్కూల్‌లో ఉగాది వేడుకలు

జగ్గయ్యపేట అర్బన్: శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడి, గణపతి, లక్ష్మీదేవి పూజ, మామిడి తోరణాలతో పాఠశాల వాతావరణం పండుగను తలపించింది. ఏపీపీఎస్‌ఏ ఉమ్మడి జిల్లాల చైర్‌పర్సన్, విజ్ఞాన్ విద్యా సంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నీటి వనరులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి



నీటిని పొదుపు చేయాలని అవగాహన కల్పిస్తున్న జలజీవన్ మిషన్ పీడీ హరేరామ్

పరిటాల(కంచికచర్ల): నీటి వనరులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని అప్పుడే నీటి సమస్య ఉండదని జలజీవన్ మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ హరే రామ్ నాయక్ అన్నారు. మండలంలోని పరిటాల గ్రామ సచివాలయంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నీటిని ఎఫ్‌టీకే కిట్ ద్వారా నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చుకోవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలన్నారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటిని సరఫరా చేస్తుందన్నారు. అనంతరం హైస్కూల్‌లో చదివే విద్యార్థులకు నీటి పొదుపు ఏ విధంగా చేయాలని వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, ఎంపీడీఓ కె.బాలశంకరరావు, కోఆర్డినేటర్‌లు రామకృష్ణ, నాగేశ్వరరావు, రామ శేషాచార్యులు, రామచంద్రరావు, హారిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లికార్జునరావు



నందిగామ: నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బండి మల్లికార్జునరావు, పి.ప్రకాశరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియ సోమవారం జరిగింది. ఎన్నికల అధికారి మన్నెం నారాయణరావు నూతనంగా ఎన్నికైన కమిటీ వివరాలను మంగళవారం మీడియాకు అందజేశారు. 2023–2024 సంవత్సరానికి అధ్యక్షుడిగా బండి మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రకాశరావు, కోశాధికారిగా సీహెచ్ లక్ష్మీదుర్గ, సహాయ కార్యదర్శిగా కేఎస్ రాధాకృష్ణ, గ్రంథ పాలకుడుగా జి.పవన్ కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ కార్యదర్శిగా షేక్ ఆజాద్, మహిళ సంరక్షణ కార్యదర్శిగా కె.దివ్య ఎన్నికైనట్లు తెలిపారు.

ముగిసిన లూర్దుమాత ఆలయ వార్షిక మహోత్సవాలు

వీరులపాడు: మండలంలోని బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్దుమాత ఆలయ 74వ వార్షిక మహోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. మహోత్సవాలలో భాగంగా మంగళవారం ఫాదర్ సాలె వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ కార్యక్రమంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏసుక్రీస్తు ప్రతిమను ప్రత్యేకంగా విద్యుత్ దీప కాంతులతో అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కర్ల స్వాతి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజు, దాసు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి సాయంత్రం వరకు సొరంగ మార్గం మూసివేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం వంగవీటి మోహన రంగా జంక్షన్ నుంచి చిట్టినగర్ వైపు వెళ్లే సొరంగ మార్గాన్ని బుధవారం సాయంత్రం వరకు మూసి వేస్తున్నట్లు 44, 45 డివిజన్ల కార్పొరేటర్లు మైలవరపు రత్నకుమారి, మైలవరపు మాధురి లావణ్య తెలిపారు. సొరంగం కొండపైన ప్రమాదకరంగా ఉన్న చెట్లను నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తున్న క్రమంలో సొరంగ మార్గం ద్వారా ప్రజల రాకపోకలను నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. సొరంగం కొండపై ఉన్న వృక్షాల కారణంగా అక్కడ ఉండే మట్టి, చెత్తాచెదారం జారి కింద నుంచి ప్రయాణించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలోని ప్రమాదాలను నివారించేందుకు సొరంగం కొండపై ఉన్న చెట్లను తొలగించి అక్కడ పూర్తి స్థాయిలో శుభ్రం చేసేందుకు నగరపాలక సంస్థ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టామని వారు వివరించారు. విద్యాధరపురం, భవానీపురం ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మైలవరపు దుర్గారావు పర్యవేక్షిస్తున్నారు.



సొరంగం మార్గం వద్ద చెట్ల తొలగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న దుర్గారావు